**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తొవ్వ దినపత్రిక లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

జిల్లా బ్యూరో చీఫ్‌లు — జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌లు

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు — మండల రిపోర్టర్‌లు

సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :

8328649322, 9398236146.



# తొవ్వ

స్వాగతం

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 315 | గురువారం 19-06-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 2 | వెల : 5 రూ/.


## కేసీఆర్ వ్యాఖ్యలపై రేవంత్ వక్రీకరణ:హరీశ్



**హైదరాబాద్, జూన్ 18:** గోదావరిపై బనకచర్ల ప్రాజెక్టుపై అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు- నాటి సీఎం కేసీఆర్ వ్యాఖ్యలను సీఎం రేవంత్ వక్రీకరించారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం వక్రబుద్ధితో సీఎం ప్రజల ముందు అసత్యాలు ఉంచారని, కానీ ఆయనకు తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడాలన్న తపనే లేదని 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి అపెక్స్ కౌన్సిల్ సమావేశ అజెండా-5ను దాచి పెట్టి, అజెండా-1 అంశాలే ప్రస్తావించారని హరీశ్ చెప్పారు. గోదావరి- కృష్ణా నదుల అనుసంధాన ప్రాజెక్టులపై ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణను సంప్రదించకుండా ముందుకెళ్లరాదని అజెండా-5లో నాడు కేసీఆర్ స్పష్టంగా పేర్కొన్నారని వెల్లడించారు.

## అపరేషన్ సింధు షురూ..

### ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయుల తరలింపు



**న్యూఢిల్లీ:** ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం తీవ్రమవుతుండటంతో ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయుల తరలింపునకు కేంద్ర ప్రభుత్వం బుధవారంనాడు ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించింది. దీనికి 'ఆపరేషన్ సింధు' అనే నామకరణం చేసింది. తొలి దఫాగా జూన్ 17న ఉత్తర ఇరాన్ నుంచి అక్కడి భారత రాయబార కార్యాలయం విజయవంతంగా అర్మేనియాకు తరలించిన 110 మంది భారతీయ విద్యార్థులను భారత్‌కు తీసుకువస్తున్నారు. అర్మేనియా క్యాపిటల్ సిటీ యెరవాన్ నుంచి బుధవారంనాడు ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీకి వీరు బయలుదేరారు. ఈ విమానం గురువారం తెల్లవారుజామున ఢిల్లీకి చేరుకుంటుందని కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. కాగా, భారతీయులను సురక్షితంగా తరలించేందుకు సహకరించిన ఇరాన్, అర్మేనియా ప్రభుత్వాలకు భారత ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. విదేశాల్లోని భారత పౌరుల భద్రత తమ అత్యంత ప్రాధాన్యతా క్రమాల్లో ఒకటని ఇండియా పునరుద్ఘాటించింది. ఇందులో భాగంగా టెహ్రాన్‌లోని ఇండియన్ ఎంబసీ అక్కడి హై-రిస్క్ జోన్లలో ఉన్న భారతీయులను ఇరాన్‌లోని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. టెహ్రాన్‌లోని ఇండియన్ ఎంబసీతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు సాగించాలని అక్కడి భారతీయులను కోరింది.




# బనకచర్ల పాపం కేసీఆర్‌దే

## తెలంగాణకు తీరని ద్రోహం చేశారు

- **2016, 2019లో చంద్రబాబు, జగన్‌తో భేటీల్లో ఈ ప్రాజెక్టుకు ఆయనే మార్గం సుగమం చేశారు**
- **రాయలసీమను రతనాలసీమగా చేస్తానంటూ పెద్దన్నగా సహకరిస్తానంటూ హామీనిచ్చారు**
- **ఇప్పుడేమో ప్రాజెక్టుపై మాట్లాడట్లేదంటూ మాపై బురద!**
- **ఈ ప్రాజెక్టుతో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగితే ఆ పాపం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, హరీశ్‌రావుదే**
- **తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ నిరభ్యంతర పత్రం ఇవ్వాలి**
- **మోదీ వద్ద పలుకుబడి ఉన్నా బాబుకు అనుమతులు భ్రమే**
- **'గోదావరి-బనకచర్ల'పై మీడియాతో సీఎం రేవంత్**

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు పాపానికి పునాది వేసిందే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని.. రాష్ట్రానికి ఆయన తీరని ద్రోహం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుపై చర్చించేందుకు బు?ధవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్రంలోని అన్ని పార్టీల లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. దానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్.. భేటీ ముగిశాక సచివాలయంలోనే ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గోదావరి బేసిన్‌లో తెలంగాణ ప్రాజెక్టులకు అన్యాయం, తీరని ద్రోహం జరిగితే.. ఆ విషయంలో శిక్షించి, ఉరి తీయాల్సింది కేసీఆర్, హరీశ్‌రావునేనని ధ్వజమెత్తారు. వారు ఏనాడూ తెలంగాణ ప్రయోజనాల కోసం కృషి చేయలేదని.. కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి, కుట్రలు చేశారని మండిపడ్డారు. ప్రాజెక్టుల విషయంలో సర్వపాపాలు చేసి, పాపాల భైరవులుగా మారి రాష్ట్రానికి అన్యాయం చేశారని దుయ్యబట్టారు. వారే ఇప్పుడు.. 'బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్ మాట్లాడట్లేదు' అంటూ తనపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారంటూ నిప్పులు చెరిగారు. బనకచర్ల ప్రాజెక్టు గురించి ఏపీ శాసనసభలో సీఎం చంద్రబాబు మాట్లాడిన వెంటనే తాము కేంద్ర మంత్రిని కలిసి.. ఆ ప్రాజెక్టుతో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంతో పాటు అన్ని వివరాలనూ తెలిపామని సీఎం చెప్పారు. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రితోనూ చర్చించామని.. ఇప్పటికే ఈ విషయంలో కేంద్ర జల్‌శక్తి మంత్రికి రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ లేఖలు రాశారని గుర్తుచేశారు. అఖిల పక్ష సమావేశం నిర్వహించడం వెనుక రాజకీయ ప్రేరేపిత అంశాలేవీ లేవన్న సీఎం.. భవిష్యత్ కార్యాచరణ, ప్రణాళికలపై ప్రతిపక్షాలను సూచనలు అడిగినట్టు తెలిపారు. రాజకీయ అంశాలకు అవకాశం ఇవ్వకూడదని భావించే.. ఈ భేటీకి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు ఎంఐఎం, బీఆర్ఎస్ పార్లమెంటు సభ్యులను ఆహ్వానించామన్నారు.ఆ సమావేశంలో చర్చించిన పలు విషయాలను ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం పేర్కొన్నారు. "గోదావరి, కృష్ణా జలాలకు సంబంధించి 2016 సెప్టెంబరు 21న నాటి కేంద్ర జలశక్తి మంత్రి ఉమాభారతి అధ్యక్షతన జలశక్తిభవన్, న్యూఢిల్లీలో సమావేశం నిర్వహించారు. ఆందులో అప్పటి సీఎంలు కేసీఆర్, చంద్రబాబుతో పాటు రెండు రాష్ట్రాల మంత్రులు హరీశ్‌రావు, దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఆ సమావేశంలో గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డుల నిర్వహణ, ప్రాజెక్టుల నిర్మాణాలపై, అనుమతులపై సుదీర్ఘంగా చర్చించారు. 8 పేజీలతో సమావేశం వివరాలను నమోదుచేశారు. అందులో 6వ పేజీలోని రెండో పేరాలో పేర్కొన్న దాని ప్రకారం "గోదావరి జలాల్లో 3వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయి. కృష్ణా బేసిన్‌లో నిర్మించుకునే ప్రాజెక్టులకు 1000 టీఎంసీల అవసరం ఉంది. గోదావరి బేసిన్ నుంచి కృష్ణా బేసిన్‌కు నీటిని తరలించుకోవడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చ"ని పేర్కొన్నారు. అంటే గోదావరిలో 3వేల టీఎంసీలు వృథా అవుతున్నాయి, వాటిని కృష్ణా పరీవాహక ప్రాంతానికి తరలించి తద్వారా రాయలసీమకు నీళ్లు ఇవ్వాలనే విషయానికి పునాది పడింది అప్పుడే. ఇది అధికారిక సమావేశంలో చెప్పిన విషయం. ఈ విషయం అప్పటి మంత్రి హరీశ్‌కు తెలియదనడం కరెక్ట్‌కాదు. ఈ వివరాలను హరీశ్‌కు పంపుతా" అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అయితే ఆ తరువాత.. కేసీఆర్, చంద్రబాబుల మధ్య ఉన్న వైరాలు, అంతరాల వల్ల అది కార్యరూపం దాల్చలేదన్నారు. 2019లో ఏపీలో జగన్ సీఎం అయ్యాక.. తెలంగాణలో కేసీఆర్ రెండోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టాక.. వారిద్దరూ 2019 జూన్ 28, ఆగస్టు, సెప్టెంబరు, మళ్లీ ఆ తరువాత ఏడాది ఆగస్టు నెలల్లో.. మొత్తం నాలుగు సార్లు భేటీ అయ్యారని, ఆ సమావేశాల్లోనే జలబంధం ఏర్పడిందని రేవంత్ వ్యాఖ్యానించారు.

## సామాన్యులకు అందుబాటులోకి ఇసుక: వివేక్

- గనులు, కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతల స్వీకరణ



**హైదరాబాద్, జూన్ 18:** రాష్ట్రంలో సామాన్యులకు ఇసుకను అందు బాటులో ఉంచడానికి ఒక పటిష్ఠమైన పాలసీని రూపొందిస్తామని మంత్రి జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రిగా సచివాల యంలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సంక్షేమంతో పాటు, గనుల శాఖకు సంబంధించి రాబడి వృద్ధి కార్యక్రమాలను పటిష్ఠంగా చేపడతామని తెలిపారు. తనకు కార్మిక శాఖను కేటాయించడంపై సంతోషం వ్యక్తం చేశారు. తన తండ్రి నిర్వహించిన కార్మిక శాఖను తనకు కేటాయించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. టాటా టెక్నాలజీసతో కలిసి రాష్ట్రంలోని ఐటీఐల్లో రూ.2,076కోట్ల వ్యయంతో 46అడ్వాన్స్‌డ్ కోర్సులను ప్రారంభిస్తు న్నామని తెలిపారు. సంబంధిత ఫైలుపై మంత్రి తొలి సంతకం చేశారు.

## చివరి అస్త్రంగా న్యాయపోరాటం

- బనకచర్లపై తెలంగాణ సర్కారుకు అఖిలపక్షం మద్దతు
- ఈ ప్రాజెక్టు కడితే ఏపీ నీటి హక్కులు కోరే ప్రమాదం
- ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్
- కలిసికట్టుగా పోరాడుదాం: బీజేపీ ఎంపీలు
- రాజకీయాలొద్దు.. వాకౌట్ చేస్తున్నా: ఎంపీ వద్దిరాజు



**హైదరాబాద్, జూన్ 18:** గోదావరి-బనకచర్లపై చివరి అస్త్రంగా న్యాయపోరాటం చేయాలని అఖిలపక్షం ఎంపీలు నిర్ణయించారు. ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం చొరవ, చేస్తున్న పోరాటానికి మద్దతిచ్చారు. ఏపీ ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై ఎంపీల అభిప్రాయ సేకరణకు బుధవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన రెండున్నర గంటలపాటు జరిగిన అఖిలపక్షం సమావేశంలో వారు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, బీజేపీ నుంచి డీకే అరుణ, రఘునందన్‌రావు, బీఆర్ఎస్ నుంచి వద్ది రాజు రవిచంద్ర, మజ్లిస్ తరఫున అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ నుంచి రేణుకాచౌదరి, మల్లురవి, సురేశ్ షెట్కార్, బలరాం నాయక్, రవికుమార్ యాదవ్, రామసహాయం రఘురామిరెడ్డి, రఘువీర్‌రెడ్డి, జి.వంశీ, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. డీకే అరుణ, రఘునందన్‌రావు మాట్లాడుతూ.. బనకచర్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేయదని భావిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ అన్యాయం జరిగితే.. సంఘటితంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. గోదావరి, కృష్ణాల్లో ఏయే ప్రాజెక్టులకు అనుమతులు రావాల్సి ఉంది? ప్రతిబంధకాలేంటి? అని వారు అడగ్గా.. మధ్యలో జోక్యం చేసుకున్న సీఎం.. "ఆ వివరాలను ఎంపీలందరికీ పంపుతాం" అని స్పష్టం చేశారు.

## రేవంత్‌రెడ్డి పేపర్ టైగర్: కవిత



**హైదరాబాద్, జూన్ 18:** నల్లమల పులిబిడ్డనంటూ గొప్పగా చెప్పుకొనే.. రేవంత్‌రెడ్డి ఆ ప్రాంతానికి నష్టం కలిగించేలా ఏపీ జల దోపిడీకి పాల్పడుతుంటే బనకచర్ల ప్రాజెక్టుపై ఎందుకు మాట్లాడడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. తెలంగాణకు నష్టం జరుగుతున్నా పట్టించుకోని ఆయన పులిబిడ్డ కాదు.. కేవలం పేపర్ టైగర్ మాత్రమేనని విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని వెల్లడించారు. గోదావరి జలాలను తరలించుకు వెళ్లేందుకు కేసీఆర్ ఒప్పుకొన్నారని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

## యుద్ధం నేనే ఆపా!




- **భారత్ వైపు ప్రధాని నరేంద్ర మోదీ, పాక్ వైపు ఆర్మీ చీఫ్ మునీర్ సమర్థంగా పనిచేశారు**
- **కాల్పుల విరమణతో అమెరికాకు సంబంధం లేదని ట్రంప్‌కు మోదీ స్పష్టం చేసిన తర్వాత వ్యాఖ్య**
- **పాక్ అభ్యర్థిస్తేనే ఆపరేషన్ ఆపామన్న మోదీ వాణిజ్యం, మధ్యవర్తిత్వంపై అమెరికాతో చర్చే లేదని వెల్లడి-**
- **ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి ఫోన్లో మాటామంతీ**

న్యూఢిల్లీ, జూన్ 18: యుద్ధాన్ని ఆపడంలో భారత్ వైపు ప్రధాని మోదీ, పాకిస్థాన్ వైపు ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ ప్రభావవంతంగా వ్యవహరించారని... అయితే యుద్ధాన్ని మాత్రం తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. కాల్పుల విరమణకు అంగీకరిస్తే భారీగా వాణిజ్యం చేస్తామని, లేకుంటే వాణిజ్యం మొత్తంగా నిలిపివేస్తామని తాను చేసిన హెచ్చరికలతోనే భారత్, పాక్ యుద్ధం నిలిపివేశాయని గతంలో ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు భారత్ తరఫున మోదీ, పాక్ తరఫున ఆసిమ్ మునీర్ యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నించారంటూ వారికి కొంత క్రెడిట్ ఇచ్చారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో అమెరికాకు ఎలాంటి సంబంధం లేదని ట్రంప్‌కు ప్రధాని మోదీ స్పష్టం చేసిన నేపథ్యంలో ట్రంప్ కాస్త వెనక్కి తగ్గినట్టుగా అభిప్రాయం వ్యక్తమవుతోంది. బుధవారం ట్రంప్ అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్‌హౌజ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. "పాకిస్థాన్, భారత్ మధ్య యుద్ధాన్ని నేనే ఆపాను. ఐ లవ్ పాకిస్థాన్. మోదీ ఒక అద్భుత వ్యక్తి. గత రాత్రే నేను ఆయనతో మాట్లాడాను. భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకోబోతున్నాం. పాకిస్థాన్ వైపు ఆ దేశ ఆర్మీ చీఫ్, భారత్ వైపు ప్రధాని మోదీ.. యుద్ధాన్ని ఆపడంలో ఇద్దరూ ప్రభావవంతమైన వ్యక్తులు. వారి పని వారు చేశారు. రెండూ అణ్వస్త్ర సామర్థ్యమున్న దేశాలు. వారి మధ్య యుద్ధాన్ని నేను ఆపాను" అని వ్యాఖ్యానించారు. తాను చేసిన గొప్పపనిని మీడియా సరిగా పట్టించుకోవడం లేదనే ఉద్దేశాన్ని ట్రంప్ వ్యక్తం చేశారు.

# ఖానాపురం మండల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి





**తొవ్వ, ప్రతినిధి, ఖానాపూర్, జూన్ 18:**
స్థానిక సంస్థల ఎన్నికల కోసమే సంక్షేమ పథకాలు ఇస్తామంటూ హడావుడి చేస్తున్నా కాంగ్రెస్ నాయకులుఓట్ల కోసమే రైతు భరోసా,ఇందిరమ్మ ఇండ్లు. ప్రతి రైతుకు ఎకరాకు 25 వేల రూపాయలు బాకీ పడ్డా రేవంత్ సర్కార్.రైతులకు బాకీ పడ్డ మొత్తం రైతు భరోసా డబ్బులు చెల్లించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలి. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు భరోసా మరియు ఇతర సంక్షేమ పథకాలు ప్రజలకు అందివ్వాలి అని ఆయన అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించే సత్తా కాంగ్రెస్ పార్టీకి లేదు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో ఇచ్చిన ఆరూ గ్యారెంటీలు, 420 హామీలపైన ప్రజలు ప్రశ్నించాలిఅని అన్నారు. రైతులను,మహిళలను,వృద్ధులను, విద్యార్థులను ,యువకులను అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది. గత 18 నెలలుగా గ్రామాలలో పరిపాలన, అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలు జరగడం లేదు.కాంగ్రెస్ పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. కెసిఆర్ గారి ప్రభుత్వం లో శాసనసభ్యుడిగా నేను చేసిన అభివృద్ధి కార్యక్రమాలు మాత్రమే గ్రామాలలో, తండాలలో పట్టణాలలో కనబడుతున్నవి. రాష్ట్రస్థాయిలో నర్సంపేట నియోజకవర్గం ను అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచాను. చరిత్రలో నిలిచిపోయే విధంగా పాకాల- రామప్ప ప్రాజెక్ట్, జిల్లా హాస్పిటల్, మెడికల్ కళాశాల, పల్లె దావఖానాలు, గోదాములు, బీటీ రోడ్లు సిసి రోడ్లతో శాశ్వత ప్రాతిపాదికన నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను.నేను శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం 108 గా పనిచేసిందిగెలిచిన ఎమ్మెల్యేకు గ్రామాల అభివృద్ధి పైన విజన్ లేదు.నియోజకవర్గ అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీ నాయకులకు మాట్లాడే నైతిక హక్కు లేదు.బ్రిడ్జిలు, బీటీ రోడ్లు,చెక్ డ్యాములు కమిషన్ల కోసం అమ్ముకుంటున్నారూ. కొనుగోలు కేంద్రాలలో కాంగ్రెస్నాయకులురైతులను దోసుకున్నారు .ఖానాపురం మండలంలో అకాల వర్షాలతో రైతులు నష్టపోతే ఒక్క రూపాయి నష్టపరిహారం ఇవ్వలేదు.ప్రతి మహిళకు ,వృద్ధులకు బాకీ పడ్డ సొమ్మును చెల్లించిన తర్వాతనే కాంగ్రెస్ నాయకులు ఓట్లు అడగాలి. అని అన్నారు.ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి.మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ప్రతి గ్రామంలో మనం చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు వివరించండి . నియోజకవర్గంలో మెజార్టీ స్థానాలలో బిఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుంది.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, ఓ డి సి ఎం ఎస్ చైర్మన్, మాజీ ఎంపీపీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ జెడ్పిటిసి, క్లస్టర్ బాధ్యులు, గ్రామాల ఇన్చార్జిలు, మాజీ ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా యూత్ నాయకులు ,అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు మండల,గ్రామ కమిటీ బాధ్యులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలి

**అధిక సంఖ్య ఉన్న కులాలను విస్మరించడం దారుణం - సీఎం రేవంత్ రెడ్డి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి**

**నామినేటెడ్ పోస్టుల్లోనూ అవకాశం కల్పించాలి - ఈనెల 30న యాదవుల ఆత్మగౌరవ సభ..యాదవ బిడ్డలంతా భారీగా తరలిరావాలి**

**బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షులు - డి రాజారాం యాదవ్ పిలుపు.**





**తొవ్వ, ప్రతినిధి, ఖానాపూర్, జూన్ 18:**
దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడమే కాకుండా, రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న యాదవ జాతికి కేబినెట్ లో చోటు లేకపోవడం సిగ్గుచేటని రాజారాం యాదవ్ అన్నారు. బుధవారం నర్సంపేట మాదన్నపేట రోడ్డులో యాదవ సంఘం కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యాదవ సంఘాల జాక్ నర్సంపేట నియోజకవర్గ బాధ్యులు బీసీ ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు ఆబోతు రాజు యాదవ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.. సభ అధ్యక్షులు ఆబోతు రాజు యాదవ్.. యాదవులు ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందుకుంటూనే బీసీలకు అండగా నిలవాలని అన్నారు.. ఈ కార్యక్రమ ముఖ్య అతిథులు బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాం యాదవ్ అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడంగి గోవర్ధన్ యాదవ్, తెలంగాణ యాదవ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మేకల కృష్ణ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జనగాం జిల్లా అధ్యక్షులు బిసి కులాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బనుక సిద్దిరాజ్ యాదవ్ పాల్గొన్నారు. ఈనెల 30న హైదరాబాదులో జరిగే యాదవుల ఆత్మగౌరవ సభకు భారీసంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజారాం యాదవ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు లేరు అనే సాకుతో యాదవ జాతిని వెనకబాటుకు గురిచేయవద్దని, వెంటనే మంత్రి పదవి కేటాయించాలని కోరారు. ప్రతీ జిల్లాలో, నియోజకవర్గంలో యాదవ కులస్తులు ఆవేదనతో ఉన్నారని చెప్పారు. నీతికి, నిజాయితీకి ప్రతీక యాదవ జాతి అని చెప్పే కాంగ్రెస్ పెద్దలు తక్షణమే మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మంచి మనస్సుతో అలోచించి కులానికి పదవి కల్పించాలని విన్నవించారు. ఈనెల 30వ తేదీన యాదవుల ఆత్మగౌరవ సభ ఇందిరా పార్క్ లో నిర్వహిస్తున్నామని, యాదవ బిడ్డలంతా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునించారు.

**ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా..**

**లొడంగి గోవర్ధన్ యాదవ్**

యాదవ జేఏసీ ఆధ్వర్యంలో జూన్ 30న ఇందిరా పార్క్ లో యాదవ ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నామని లొడంగి గోవర్ధన్ యాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కనివిప్పు కలిగేలా ఈ సభ ఉండబోతోందని పేర్కొన్నారు. సభను విజవంతం చేయడానికి ఉమ్మడి వరంగల్ జిల్లా యాదవులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో యాదవులకు మంత్రి పదవి లేకపోవడం దుర్మార్గపు చర్య అని అభివర్ణించారు.హిందూ జాతికి భగవద్గీతను అందించిన జాతి యాదవ జాతి అని, తెలంగాణలో గోల్కొండను నిర్మించిన చరిత్ర యాదవ జాతిదని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మళ్లీ నింపబోయే కేబినెట్ పదవుల్లో యాదవ జాతికి పెద్ద పీట వేయాలని కోరారు. అలాగే జనాభా ధమాషా పద్ధతిలో యాదవులకు రావాల్సిన నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో జరిపిన సమగ్ర కుటంబ సర్వేలో ముస్లింలు లేకుండా బీసీలు 52% ఉన్నారని, కానీ ఇప్పుడు ముస్లింలను కలుపుకొని 56% బీసీలు ఉన్నారు అని చెప్పడం సిగ్గుచేటన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42% స్థానిక సంస్థల్లో బీసీలకు అవకాశం కల్పించాలని కోరారు. యాదవులు, మున్నూరుకాపులు లేని మంత్రి మండలి ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ కు మున్నూరుకాపులు కే కేశవరావు, డీఏస్ లాంటి వారు ఎన్నో సేవాలు చేశారని చెప్పారు. బీసీలకు మంత్రి మండలిలో సమూచిత స్థానం కల్పించాలని బీసీ కులాల లెక్కన 9 మందికి చోటు కల్పించాలని కోరారు. యాదవులు ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న రెండో విడత గొర్రెల పంపిణీని వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం మేకల కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. చరిత్రలో యాదవులు లేకుండా మంత్రి మండలి లేదని, యాదవ మంత్రి లేకుండా పాలన చేస్తున్న ఏకైక సీఎం రేవంత్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. యాదవులను మరిచిపోతే కచ్చితంగా తగిన మూల్యం చెల్లిస్తారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మా సత్తా చాటుతామని హెచ్చరించారు. కొమ్మనబోయిన వేణు యాదవ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు మొదటి అడుగు వేసి ఓట్లు వేసింది యాదవ జాతి బిడ్డలేనని గుర్తు చేశారు. యాదవులకు మంత్రి పదవి ఇవ్వకపోవడంలో కాంగ్రెస్ ఉద్దేశం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ యాదవ్, మేకల కృష్ణ యాదవ్, సిద్దిరాజు యాదవ్, ఆబోతు రాజు యాదవ్, కొమ్మనబోయిన వేణు యాదవ్, ఆబోతు అశోక్ యాదవ్, గజ్జి కొమురెల్లి యాదవ్, లింగన్న యాదవ్ ఆబోతు రాజ్ కుమార్ యాదవ్, బూడిద ముఖేష్ యాదవ్, బండి పర్వతాలు యాదవ్,సతీష్ యాదవ్, రాజు యాదవ్, బీరం శ్రీకాంత్ యాదవ్, అక్షయ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలి

**సిపిఐ మండల కార్యదర్శి బైస స్వామి - శ్రీరామగిరి, వెంకటాపురం నూతన గ్రామ శాఖల నిర్మాణం**




**తొవ్వ, నెల్లికుదురు, జూన్ 18**
ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి బైసా స్వామి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో సిపిఐ పార్టీ గ్రామ శాఖ మహాసభ సీనియర్ కార్యకర్త గంట నాగన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదలైన వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 12000 చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ అమలు చేయకపోవడం ప్రభుత్వానికి పేదలపై ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుంది అన్నారు. అర్హులైన ప్రతి వ్యక్తికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, రేషన్ కార్డులు త్వరితగతిన అందించాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండలంలోని రాజుల కొత్తపల్లి, రావిరాల చెరువుల గండ్లను త్వరితగతినపూడ్చి ఆయా గ్రామాల రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. లేనట్లయితే రైతులు మత్స్యకారులతో కలిసి ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం శ్రీరామగిరి వెంకటాపురం గ్రామ శాఖ కార్యదర్శిగా గంటా నాగన్న, సహాయ కార్యదర్శిగా టి సునీతలను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి టీ వెంకట్ రెడ్డి సిపిఐ సీనియర్ నాయకులు చిర్రవెంకన్న గౌడ్, నాయకులు కొండేటి శంకర్, నరసయ్య, మౌనిక ,సుధారాణి, సావిత్రమ్మ, సులోచన, శ్రీలత, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఏటీఎం చోరీకి దుండగుల ప్రయత్నం

**తొవ్వ : 18 జూన్,ఎల్బీనగర్ ప్రతినిధి**




ఓల్డ్ సిటీలోని ఐఎస్ సదన్ వద్దనున్న కోటక్ మహీంద్ర ఏటీఎంలోకి ప్రవేశించిన దొంగలు.మెషీన్‌ను ధ్వంసం చేసి.. డబ్బులు దోచుకెళ్లేందుకు తీవ్రంగా ప్రయత్నించిన దుండగులు.ఎంత ప్రయత్నించినా చేతకాకపో వడంతో.. అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయిన వైనం. సీసీ కెమెరా లో నమోదైనా దృష్యలు. కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు జరుపుతున్న పోలీస్లు.

# ఆస్తి కోసం తోడబుట్టిన వారితో కొట్లాడి ఏం సాధిస్తారు




**తొవ్వ : 18 జూన్,ఎల్బీనగర్ ప్రతినిధి**
తల్లిదండ్రులు బ్రతికి ఉన్నంత వరకు పిల్లలు ఆస్తిలో వాటా కోరకుండా ఉండే చట్టం తెస్తే బాగుంటుంది.44 గజాల స్థలం కోసం కోర్టు మెట్లు ఎక్కిన కుటుంబం, విచారణ సమయంలో కీలక వ్యాఖ్యలు చేసిన హైకోర్టు.264 గజాల స్థలం కోసం హైకోర్టులో పిటిషన్ వేసిన ఆరుగురు కుటుంబసభ్యులు (తల్లిదండ్రులతో కలిపి).విచారణ సమయంలో ఒక్కో మనిషికి 44 గజాల స్థలం వస్తుందని, ఆ స్థలంలో ఇల్లు కూడా కట్టుకోలేరు కదా అని ప్రశ్నించిన జస్టిస్ బి.విజయ్ సేన్ రెడ్డి.మాకు అధికారం ఉండుంటే తల్లిదండ్రులు బ్రతికి ఉన్నంత వరకు పిల్లలు ఆస్తిలో వాటా అడగకుండా చట్టం తెచ్చే వాళ్లమని అసహనం వ్యక్తం చేసిన హైకోర్టు.

# పట్టపగలే.. కత్తులు, బ్యాట్ లతో దాడులకు తెగించిన కబ్జా రాయుల్లు



**తొవ్వ : 18 జూన్,ఎల్బీనగర్ ప్రతినిధి**
హైదరాబాద్ - గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ దగ్గరలో ఉన్న ఎఫ్.సి.ఐ. కాలనీ లే అవుట్ లో రోడ్లు మార్కింగ్ చేపట్టిన హైడ్రా.ప్లాట్ ఓనర్స్ సమక్షంలో హైడ్రా అధికారులు రోడ్లు మార్కింగ్ చేస్తుండగా.. వీడియో తీస్తున్న ప్లాట్ యజమానులపై సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర్ రావు అనుచరులు దాడి.ప్లాట్ యజమానురాలైన సినీనటి రమ్యశ్రీ, ఆమె సోదరుడు ప్రశాంతపై కత్తి, క్రికెట్ బ్యాట్ తో దాడికి పాల్పడ్డ శ్రీధర్ రావు అనుచరులు.గాయాల పాలైన సినీనటి రమ్యశ్రీ, ఆమె సోదరుడు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు.పోలీస్ స్టేషన్ ఎదురుగానే పట్టపగలు దుండగులు.. తమపై హత్యాయత్నం చేసేందుకు ప్రయత్నించారని వాపోయిన సినీ నటి రమ్యశ్రీ.సంధ్య కన్వెన్షన్ శ్రీధర్ రావు ఆగడాలకు అడ్డుకట్ట వేసే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసిన నటి రమ్యశ్రీ.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**మండల ప్రత్యేక అధికారిజినుగు మరియన్న**



**తోవ్వ, నెల్లికుదురు, జూన్ 18**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జినుగా మరియాన్న సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని వావిలాల, ఆలేరు, బంజర, శ్రీరామగిరి, మునిగలవిడు, నల్లగుట్ట తండా, జామ తండా గ్రామాల్లో ఇందిరమ్మ గృహాలకు మార్కింగ్ చేస్తున్న తీరును స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాలరాజు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన నిబంధన మేరకు పనులు పూర్తి చేయాలన్నారు. మార్కింగ్ పనులు వేగవంతం చేయాలని తెలిపారు. అలాగే పునాదులు, ఇతర నిర్మాణ పనులు పూర్తి స్థాయి లో చేసే విధంగా సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. వర్షాకాలం అయినందున నిర్మాణం వేగవంతం చేసుకుని ప్రథమ దశ బిల్లులు పొందాలని లబ్ధిదారులకు సూచించారు..ఈ పరిశీలనలో, మండల పంచాయతీ అధికారి శ్రీమతి బి. పద్మ, హౌసింగ్ ఇంజనీరు, వై అనిల్, ఏపిఎం .వరదయ్య పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**తొవ్వ,ప్రతినిధి, నర్సంపేట, జూన్,18:**
నర్సంపేట పట్టణానికి చెందిన మాజీ వార్డు సభ్యులు, 11వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డే కుమారస్వామి గారి తండ్రి వడ్డే వీరయ్య గారు ఇటీవల మరణించిన విషయాన్ని తెలుసుకున్న నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి కీ!!శే!! వీరయ్య కుమారులు వడ్డే కుమారస్వామి, వడ్డే సదానందం, వడ్డే యాకేందర్ గార్లను నేడు పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్, నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోకల శ్రీనివాస్ రెడ్డి, నర్సంపేట మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, నర్సంపేట





నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాదాసి రవికుమార్, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పంబి వంశీకృష్ణ, నర్సంపేట మార్కెట్ డైరెక్టర్ కొల్లూరి మధుకర్, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ములుకల మనీష్, నర్సంపేట పట్టణ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేడబోయిన కుమార్, నర్సంపేట యూత్ కాంగ్రెస్ నాయకులు అనిశెట్టి జీవన్, బత్తుల రవి, చెన్నబోయిన సాయి శ్రావణ్ దాస్, నీరటి శివ, తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేట ప్రభుత్వాసుపత్రి సమస్యలపై సిపిఎం మహాధర్నా

### ఎండను సైతం లెక్కచేయకుండా రోడ్డుపై బైఠాయింపు



**యాదాద్రి జిల్లా :రామన్నపేట: తోవ్వ ప్రతినిధి :జూన్ 18**
రామన్నపేట ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న మౌలిక సమస్యలు పరిష్కరించి, వంద పడకల ఆసుపత్రిగా మార్చి మండల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లల పెంటయ్య మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ఆసుపత్రి ముందు 350 మందితో మహాధర్నా నిర్వహించి అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 ఏళ్లుగా ప్రజలకు సేవలు అందిస్తూ దినదినాభివృద్ధి కావలసిన ప్రజా వైద్యశాల నేడు శిథిలావస్థకు చేరి కనీస సౌకర్యాలు లేకుండా తిరోగమనం చెంది పేదలకు వైద్యం పెనుభారంగా మారుతుంది అన్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన పాలకవర్గాలు ఏరియా ఆసుపత్రిగా మార్చి డాక్టర్ల సంఖ్య పెంచి నూతన భవనం నిర్మిస్తామన్న వాగ్దానం కలగానే మిగిలిపోతుందని పాలకులు మారుతున్న పరిస్థితులు మారుతలేవని ఆవేదన వ్యక్తం చేశారు. దశలవారీగా రాజకీయ పార్టీలు ప్రజలు ఉద్యమిస్తున్న అనేకమార్లు ప్రజా ప్రతినిధులకు అధికారులకు విన్నవించిన పట్టించుకునే నాధుడే కరువయ్యారని ప్రజలే స్వచ్ఛందంగా రోడ్లమీద కొచ్చి నిరసన తెలుపుతున్న పరిస్థితి వచ్చిందని అన్నారు. గైనిక్ డాక్టర్లు అందుబాటులో లేక ప్రసవాల సంఖ్య గరిష్టంగా తగ్గిందని దీనికి గల కారణాలను వైద్యాధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు. పరిశుద్యం నిర్వాణ లేక తాగడానికి మంచినీళ్లు, మరుగుదొడ్ల సౌకర్యం, ఆధునిక సాంకేతిక వైద్య పరికరాలు అందుబాటులో రోగులు అనేక అవస్థలు పడుతున్నారని ప్రభుత్వాసుపత్రి పై ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షణ లోపించడం మూలంగానే ఈ పరిస్థితికి కారణమైందని వెంటనే పునరాలచన చేసుకోవాలని అన్నారు. వెంటనే సమస్యలు పరిష్కారం చేయకపోతే మండల వ్యాప్తంగా ప్రజల్ని కదిలించి మండల బంధు నిర్వహించి అన్ని రాజకీయ పార్టీలతో ప్రజలు ఉద్యతం చేస్తామని హెచ్చరించారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ధర్నా అనంతరం ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడంతో సిపిఎం శ్రేణులు స్థానిక సుభాష్ సెంటర్లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడం జరిగింది స్థానిక పోలీసులు జోక్యం చేసుకొని సూపరిండెంట్ డాక్టర్ చిన్నా నాయక్ తో చర్చలు జరపగా ధర్నా వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకొని పది రోజుల్లో సూపరిండెంట్ స్థాయిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మనం ఉపేందర్ బల్గూరి అంజయ్య మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిని ఆనందం కందుల హనుమంతు, కల్లూరి నాగేష్,జంపాల అండాలు, మండల కమిటీ సభ్యులు నాగటి ఉపేందర్ గన్నబోయిన విజయభాస్కర్ గొరిగెసోములు,మీర్ ఖాజా అలీ, భావనలపల్లి బాలరాజు, ఆమనగంటి నాగేష్, బొడిగె రజిత ఎండి రషీద్, గాదె నరేందర్,మైడి గణేష్,వేముల సైదులు, తోలుపునూరి శ్రీనివాస్, శాఖా కార్యదర్శులు మణికుంట్ల లెనిన్ తాళ్లపల్లి జితేందర్ పులిబిక్షం శానగోండ వెంకటేశ్వర్లు కోనూరు మల్లేశం అంబటి మల్లారెడ్డి గన్నెబోయిన శ్రీనివాస్, గుండాల ప్రసాద్,గోగు లింగస్వామి, పావిరాల మత్స్యగిరి, గంగాదేవి మల్లేశం, మాజీ ఎంపిటిసి బడుగు రమేష్,సింగిల్ విండో డైరెక్టర్ కొమ్ము అంజమ్మ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్, డివైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష,కార్యదర్శులు శానగొండ రామచంద్రం, ,మెట్టు శ్రవణ్ కుమార్,పుట్టల ఉదయ్ కుమార్, గటపాక శ్రీకృష్ణ,నరేష్, సంపతు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా మారిన ఆసిఫ్ నహర్ కాల్వ కట్టను ముందస్తు మరమ్మత్తు చేయాలి

### సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం

**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: జూన్ 18**
మునిపంపుల గ్రామ పరిధిలో ఆసిఫ్ నహర్ కాలువ(రాచకాల్వ) శిథిలావస్థకు చేరి అధిక వర్షాలు వస్తే తెగిపోయే ప్రమాదం ఉందని కట్టను వెంటనే మరమ్మత్తులు చేసి పరిష్కృతంగా పేరుకుపోయిన కంపచెట్లను తొలగించి ముందస్తు చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం డిమాండ్ చేశారు. మునిపంపుల సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం తహసిల్దార్ లాల్ బహుదూర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 100 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆసిఫ్ నగర్ కాలువ కట్ట పూర్తిగా శిథిలావస్థకు చేరి భారీ వర్షాలు వచ్చినప్పుడు నీటి సామర్థ్యం పెరిగి కట్టమీద పొంగిపోవడంతో సమీపంలో ఉన్న దళిత కాలనీ బిక్కుబిక్కుమంటూ కాలమెల్ల తీయాల్సి వస్తుంది అన్నారు. ఈ సంవత్సరం అధిక వర్షాలు ఉన్నాయని వాతావరణ సూచనలు దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలు చేపట్టి ప్రమాదాన్ని అరికట్టాలని అన్నారు. కట్టపై విపరీతంగా పేరుకుపోయి రైతులకు వ్యవసాయ కూలీలకు గీత కార్మికులకు రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్న కంపచెట్లను ఉపాధి హామీ పథకం ద్వారా తొలగించి సమస్య పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యురాలు జంపాల అండాలు మండల కమిటీ సభ్యులు తొలుపునూరి శ్రీనివాస్ శాఖ




కార్యదర్శి తాళ్లపల్లి జితేందర్, పావురాల మచ్చ గిరి,నాయకులు జోగులశ్రీనివాస్, జంపాల ఉమాపతి,బూడిద బిక్షం,గంటపాక శివకుమార్, అప్పం సురేందర్ సిరిశాల యాదగిరి జోగుల సాయికుమార్ కనుకుంట్ల ఉపేందర్, తుర్కపల్లి నరేష్,జంపాల మహేష్,ఎడ్ల ధనమ్మ,బొడ్డుపల్లి సంధ్య, నోముల మంగమ్మ,గంటపాక అశ్విని,గంప పద్మ,మమతా, షఫీ తదితరులు పాల్గొన్నారు.

# వలిగొండ బిజెపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శిగా లోడే

**యాదాద్రి జిల్లా: వలిగొండ: తోవ్వ ప్రతినిధి:జూన్ 18**
భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ ప్రధాన కార్యదర్శిగా రెండోసారి ఏకగ్రీవంగా వర్కట్పల్లి గ్రామానికి చెందిన లోడే లింగస్వామి గౌడ్ ను పార్టీ వికసిత్ భారత్ కార్య శాల సమావేశంలో వలిగొండ మండలానికి ముఖ్యఅతిథి గా విచ్చేసిన యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ అధ్యక్షులు పాశం భాస్కర్ వలిగొండ మండల ప్రధాన కార్యదర్శి గా లోడే లింగస్వామి గౌడ్ ను ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా లోడే లింగస్వామి



గౌడ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన మండల పార్టీ అధ్యక్షులు బోల్ల సుదర్శన్ కి, అదే విధంగా మండలంలోని జిల్లా, మండల నాయకులకు, పార్టీ సీనియర్ నాయకులకు, బూత్ అధ్యక్షులకు, కార్యకర్త బంధువులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని పరిశీలన

### -జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో



**బయ్యారం,తోవ్వ,జూన్ 18.**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో బుధవారం మండలంలోని బయ్యారం ,కొత్తపేట గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ళ మార్కింగ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేదవారి ఇంటి నిర్మాణం కోసం ఏర్పాటుచేసిన ఈ పథకం జిల్లాలో క్షేత్రస్థాయిలో పనులు వేగంగా పురోగతిలో ఉన్నాయని, ప్రత్యేక అధికారులు ప్రతిరోజు ఉదయం సాయంత్రం క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ ఉన్నారని, ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చుటకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉంటూ పనులు నిర్వహించాలని ఆదేశించారు. సంబందిత అధికారులు ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు అవగాహన కల్పిస్తూ పనులు వేగవంతంగా అయ్యేటట్లు చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో విజయలక్ష్మి,పంచాయతీ సెక్రటరీలు,వెలుగు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మట్టి తొలకంపై మౌనమేల

### బయ్యారం పెద్ద చెరువు అక్రమ మట్టి నిల్వలపై అధికారుల చర్యలు శూన్యమేనా...!

### అధికారుల కనుసన్నల్లో అక్రమ మట్టి తోలకాలు జరిగాయా...?

**బయ్యారం,తోవ్వ,జూన్ 18.**
మండలంలోని బయ్యారం పెద్ద చెరువులో కొంతమంది ఇటుక బట్టి వ్యాపారులు ఎటువంటి అనుమతి లేకుండా చెరువు మట్టిని తరలిస్తూ చెరువు మెట్ట భూముల్లో డంపులుగా నిలువలు చేసుకున్నారని, మంగళవారం తోవ్వ కథనాన్ని ప్రసారం చేసినా,అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనక ముందు ఆడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయమైతే చెరువులోనే జెసిబి యంత్రాలు, ట్రాక్టర్ల సహాయంతో యదేచ్ఛగా మట్టి తరలిస్తూ మూల పోచారం సమీపంలో డంపులుగా నిల్వ చేస్తున్నారు. దీనిపై మైనింగ్ శాఖ, రెవిన్యూ , ఇరిగేషన్ శాఖ లో అధికారులు పట్టించుకోవాల్సి ఉన్నా వారు పట్టించుకోక పోవడంలో ఆంతర్యం ఏమిటని,వారి కనుసన్నల్లోనే ఈ తంతు జరుగుతుందా అనే అనుమానాలు,పలువురు ఆరోపణలు పెద్ద ఎత్తున వినపిస్తున్నాయి ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు అక్రమ మట్టితోలకాలపై,మట్టి డంపుల నిల్వలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా మంద ఉదయ్ జన్మదిన వేడుకలు



**యాదాద్రి జిల్లా:రామన్నపేట: తొవ్వ, ప్రతినిధి: జూన్ 18**
రామన్నపేట మండలం టిఆర్ఎస్ యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి మంద ఉదయ్ జన్మదిన వేడుకలు నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాసులు గౌడ్ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు కళ్లెం స్వామి టిఆర్ఎస్ యువ నాయకులు పావురాల నరసింహ యాదవ్ కళ్లెం ఆంజనేయులు రుద్రవరం రాకేష్ ఉప్పలపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట పట్టణంలో ఇటీవల మృతి చెందిన BRS పార్టీ కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి



**తొవ్వ, ప్రతినిధి నర్సంపేట, జూన్,18:**
నర్సంపేట పట్టణంలో ఇటీవల మృతి చెందిన బిఆర్ఎస్ పార్టీ కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పట్టణంలోని 8 వార్డు స్థానికులు వేల్పుల సాంబయ్య ఇటీవల మృతి చెందాగా వారి చిత్రపటానికి పూలు వేసి నివ్వాలు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కుమారుడు వేల్పుల శ్రీధర్ గారిని కుటుంబ బాగోగులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని శాంతినగర్ 7వ వార్డు స్థానికులు గద్దల కొమురయ్య చిత్రపటానికి పూలతో నివాళు లర్పించారు వారి కుటుంబ సభ్యులు ముగ్గురు కుమారులను పరామర్శించినారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్ పట్టణ ప్రచార కార్యదర్శి,మాజీ కౌన్సిలర్స్ మండల శ్రీనివాస్, బండి ప్రవీణ్, పెండెం వెంకటేశ్వర్లు, గందె చంద్రమౌళి, ఆకుల ప్రభాకర్, జన్ను సురేందర్, కందికొండ శ్రీను, బగ్గీ రాజు, రాజేందర్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

# ఇందిరమ్మ ఇండ్ల కు శకుస్థాపన



**తొవ్వ, దంతాలపల్లి. జూన్. 18**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటి శంకుస్థాపనకు ముఖ్యఅతిథిగా జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, దాట్ల మాజీ ఎంపీటీసీ కొమ్మినేని సతీష్ హాజరై కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. లబ్ధిదారురాలు యస్సి బేడ బుడగ జంగం కులానికి చెందిన పేర్ల మహంకాలమ్మ ఇందిరమ్మ ఇళ్లు వచ్చిన సందర్భంగా డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ కి జీవితాంతం రుణపడి ఉంటానని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మాజీఎంపీటీసీ కొమ్మినేని సతీష్ మాట్లాడుతూ... డోర్నకల్ ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ డాక్టర్ రామచంద్రునాయక్ సహకారం, కృషితో దాట్ల గ్రామంలో మొదటి విడతలో 40మంది అర్హులకు 2కోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుందని, త్వరలోనే రెండో విడతలో మరికొన్ని ఇండ్లు రానున్నాయని తెలిపారు. ఇట్టి ఇండ్లు పూర్తి పారదర్శకంగా, అవినీతికి ఆస్కారం లేకుండా లబ్ధిదారులకు అందిస్తున్నామని సతీష్ తెలిపారు. గతంలో బి.ఆర్.యస్ నేతలు, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యారే తప్పా, ఒక్కరికి కూడా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు,మూడెకరాల భూమి, దళితబంధు, లైటింగ్స్, సీసీ రోడ్లు కేటాయించలేదని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మరియు డాక్టర్ రామచంద్రు నాయక్ ఎమ్మెల్యేగా గెలిచిన 18నెలల స్వల్ప కాలంలోనే గ్రామానికి 35లక్షల సీసీ రోడ్లు మంజూరు అయి పనులు కూడా పూర్తి చేశామన్నారు. యస్సి సబ్ ప్లాన్ సీ.ఆర్.ఆర్. కింద మరో 10లక్షలు సీసీ రోడ్లు త్వరలోనే పనులు జరుగుతాయన్నారు. అలాగే కోమటి కుంట చెరువు కట్టకు 8లక్షల రూపాయలతో గత ఆరునెలల క్రితం తాత్కాలిక పనులు చేశామని,ఇప్పుడు 23లక్షలతో శాశ్వత పనులకు మంజూరు అయ్యాయని, 10లక్షల యస్.డి.యఫ్ నిధులతో స్కూల్ ప్రహరీ, టాయిలెట్స్, ఏడునర లక్షలతో ఐమాస్ట్ లైటింగ్స్ వేశామని తెలిపారు. ఇలా ఇందిరమ్మ ఇండ్లు, అభివృద్ధి పనులు కలిపి 18నెలల్లోనే దాదాపు 3కోట్ల రూపాయల విలువగల పనులు మంజూరు చేశామని తెలిపారు. ఇంకా భవిష్యత్తులోను డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ సహకారంతో ఎక్కువ పనులు చేస్తామని తెలిపారు. కాబట్టి గ్రామ ప్రజలు వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించాలని కోరారు.ఈ శంకుస్థాపన కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సెక్రెటరీ భూలక్ష్మి, మండల సీనియర్ నాయకులు మద్రు శ్రీనివాసరావు, పొడిశెట్టి వెంకట నారాయణ, మండల యూత్ ప్రధానకార్యదర్శి కాయిత శ్రీను, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షరీఫ్, బషీర్, యస్సి సెల్ అధ్యక్షుడు పోలేపంగు ఇద్దులు, చింత సంతోష్, జనార్దన్, నర్కుటి సాయి, పేర్ల రాజా, మిట్టగడుపుల వెంకన్న, అబ్దుల్, యకన్న కారోబర్ కంట్లం, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# యుద్ధలాభం ఆయుధ వ్యాపారులకే

పహల్గామ్ ఉగ్ర దాడి తరువాత సంభవించిన పరిణామాలు విస్తృత చర్చకు దారితీశాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కూడా స్వాధీనం చేసుకోడమే తమ ధ్యేయమన్న బీజేపీ నాయకుల సారథ్యంలో భారత్ వెనక్కి తగ్గిందనే ప్రచారం సాగింది. దీనిని తుడిచిపెట్టడానికి ఆపరేషన్ సిందూర్ విజయాన్ని చాటుతూ దేశమంతా ఊరేగింపులు జరిగాయి. వాస్తవంలో పూర్తిస్థాయి యుద్ధం దరిదాపులకు వెళ్లిన భారత, పాకిస్థాన్‌లు ఉన్నపళంగా ఘర్షణలను విరమించుకున్నాయి. ఇది సిమ్లా ఒప్పందం మేరకు రెండు దేశాల మధ్య చర్చల ద్వారానే జరిగిందని తాజాగా ప్రకటించుకున్నప్పటికీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చొరవతోనే యుద్ధం ఆగిందన్న సమాచారం మెరుపు వేగంతో వ్యాపించింది. అప్పుడు దానిని రెండు దేశాల పాలకులూ తక్షణమే ఖండించలేదు. యుద్ధమే జరిగితే సంభవించబోయే ఘోర పరిణామాల గురించి వివరించనక్కరలేదు. అటువంటి భయానక స్థితిని తొలగించినందుకు, భారత పాకిస్థాన్ పాలకులను ఇందుకు ఒప్పించినందుకు అమెరికా అధ్యక్షుడిని అభినందించడంలో తప్పు లేదు. అయితే ఇంతటితో యుద్ధ భాష ఆగకపోడమే ఆందోళనకరం. పరస్పరం పిప్పి, పిండి చేసుకోవాలన్న 'మీసాల' మెలివేత కొనసాగుతూనే ఉంది. ఇది రెండు దేశాల పాలకులు తమ ప్రజల్లో పొరుగు దేశం పట్ల ద్వేషాన్ని మరింతగా పెంచి రాజకీయంగా లాభపడడానికి పాటిస్తున్న వ్యూహమే. దీనివల్లనే శాశ్వత చర్చలకు ఆటంకం కలుగుతున్నది. ఇక్కడే మరొక బాధాకర పరిణామం%-%1971లో బంగ్లాదేశ్ అవతరణకు దారితీసిన యుద్ధంలో అమెరికాను సైతం ధిక్కరించిన ఇందిరాగాంధీతో మోదీని పోల్చుతున్నారు. తూర్పు, పశ్చిమ పాకిస్థాన్ల మధ్య తలెత్తిన ఆ యుద్ధం వల్ల లక్షలాదిమంది తూర్పు పాకిస్థానీయులు మన దేశంలోకి పారిపోయి రాడంతో ఇందిరాగాంధీ భారత దళాలతో ముక్తిబాహినిని సృష్టించి బంగ్లాదేశ్ అవతరణకు తోడ్పడ్డారు. అయితే ఆ యుద్ధం వల్ల సంభవించిన మానవ శోకం చెప్పనలవి కానిది. మోదీ పాకిస్థాన్‌ను ఆ విధంగా ఓడించ లేకపోయారని అనడం యుద్ధ పిపాసనే సూచిస్తున్నది. ఇది తమ ఓటు బలాన్ని తగ్గిస్తుందని, చేరువలో ఉన్న బిహార్ ఎన్నికల్లో దెబ్బ తింటామని బీజేపీ భయపడుతున్నది. అంతేగాని పూర్తి స్థాయి యుద్ధానికి వెళ్లకుండా నిగ్రహం పాటించినందుకు సంతోషించడం లేదు. ఆపరేషన్ సిందూర్ ద్వారా మోదీ పాకిస్థాన్ పీచమణిచారన్న అభిప్రాయాన్నీ బలంగా నాటుతున్నారు. పాకిస్థాన్‌ను మోకాళ్ళ మీదకు తెచ్చామని ఆయన కూడా ప్రకటించారు. ఈ అవకాశం, ఈ స్వేచ్ఛ తమకు ఇచ్చినందుకు భారత దళాలు ప్రధాని మోదీకి మొక్కుతున్నాయి అనేవారూ బయలుదేరారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఇంతవరకూ జరిగిన నాలుగు యుద్ధాల్లో అసంఖ్యాకంగా సైనికులు మరణించారు. ఆయుధాలకోసం రెండు దేశాలు విశేషంగా డబ్బు తగలబెట్టాయి. భారత ఉపఖండంలో రాజకీయం ఇప్పటికీ మతోన్మాదం ప్రాతిపదికనే కొనసాగుతున్న మాట కాదనలేని సత్యం. కశ్మీర్ పరిణామాలకూ అదే ఇంధనమవుతున్నది. హిందూత్వ రాజకీయాల మత కోణం దేశ ప్రజల మధ్య సృష్టిస్తున్న విభజన గురించి వివరించనక్కరలేదు. మతపరంగానో, సరిహద్దు వివాదం పరంగానో యుద్ధం తలెత్తితే అవతలి దేశాన్ని చీల్చి చెండాడాలని, దాన్ని నామరూపాలు లేకుండా చేసేయాలని పళ్ళు పటపటా కొరకడాన్ని అటూ ఇటూ గల ప్రజలకు అలవాటు చేశారు. భారత సైనిక దళాల మాజీ అధిపతి జనరల్ మనోజ్ ముకుంద్ నరవానే యుద్ధాన్ని గురించి కొద్ది రోజుల క్రితమే మంచి మాటలు చెప్పారు. యుద్ధాలు బాలీవుడ్ సినిమాలు కావన్నారు, యుద్ధాల్లో ఎంతమంది చనిపోతారో, మరెంతమంది వికలాంగులై జీవితాంతం ఎడతెగని వ్యథను అనుభవిస్తారో గుర్తు చేశారు. కురుక్షేత్రం లాంటి యుద్ధ గాథలు సినిమాల్లో, నాటకాల్లో చూడ్డానికే బాగుంటాయి. ఒకరినొకరు నరుక్కోడం, శత్రువు రొమ్ము చీల్చి రుధిరమ్ము తాగడం వాస్తవంలో ఎంతమాత్రం కోరదగినవి కావు. ఇప్పుడు



సరిహద్దుల రక్షణలో కన్నార్పకుండా కాపలా కాస్తున్నవారిలో, యుద్ధాల్లో ప్రాణాలు విడుస్తున్నవారిలో అత్యధికులు పేద బహుజనులే. ఉపాధి కరువై పొట్ట కూటి కోసం సైన్యంలో చేరుతున్నవారే ఎక్కువమంది. పహల్గాం ఉగ్ర దాడి బహు హేయమైనది. ఈ ఉన్మాదులు భారత, పాకిస్థాన్‌లు చేరువ కాకుండా అన్ని తంత్రాలను ప్రయోగిస్తున్నారు. రెండు దేశాల మధ్య మతపరమైన దూరాన్ని పెంచి దాన్ని అధిగమించడానికి వీలు లేని స్థాయికి తీసుకువెడుతున్నారు. భారత వ్యతిరేక ఉగ్రశక్తులకు పాకిస్థాన్ సైన్యం అండదండలు లభిస్తున్నాయి. అది పాక్ ప్రేరిత ఉగ్రవాదమే. అయితే ఈ విషయాన్ని మనం నమ్ముతున్నంతగా మిగతా ప్రపంచం నమ్మడం లేదు. మిగతా దేశాలు భారత్, పాకిస్థాన్లను ఒకేలా చూస్తున్నాయి. ఈ విషయాన్ని భారత పాలకులు తెలుసుకోవాలి. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌ను భారత్ గట్టి దెబ్బే తీసింది. అంతటితో ఆగకుండా పాకిస్థాన్ నిజస్వరూపాన్ని తెలియజేయడానికి దేశ దేశాలకు పార్లమెంటు సభ్యుల బృందాలను పంపించడం బాగుంది. అయితే అది కూడా రాజకీయ విభేదాలకు దారి తీయడం బాధాకరం. పాకిస్థాన్‌పై బలంగా విరుచుకుపడ్డాం గాని పహల్గాం దాడి ముష్కరులను కనుక్కోడంలో జాప్యం జరుగుతున్నది. వారెవరో స్పష్టంగా తెలిస్తే బాగుంటుంది. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలని భావిస్తున్న దేశాల ప్రజలు యుద్ధోన్మాదంతో వూగిపోడం సరైనది కానే కాదు. ఇది రక్షణ ఖర్చును ఆకాశానికి చేర్చి ప్రజలను కనీస విద్య, వైద్యం కూడా దొరకని దారిద్ర్యంలో కూరుకుపోయేలా చేస్తుంది. వాస్తవానికి టెర్రరిజం సమస్య చాలా లోతైనది. ప్రపంచ పాలకులు ముఖ్యంగా అమెరికా ఇజ్రాయెల్ వంటి దేశాలు చిత్తశుద్ధితో ఆలోచిస్తే వాటి అసలైన మూలాలు కనిపిస్తాయి. భారత పాకిస్థాన్‌లకూ ఇదే వర్తిస్తుంది. టెర్రరిజం గాని, వామపక్ష ఉగ్రవాదం గాని ఊరకే ఆకాశం నుంచి ఊడిపడేవి కావు. మెజారిటీ, మైనారిటీలు హాయిగా శాంతియుత సహజీవనం చేస్తున్న చోట సెక్యులరిజం వర్ధిల్లుతున్న దేశంలో మతపరమైన మెజారిటీని మైనారిటీల మీదికి రెచ్చగొట్టడం ప్రజాస్వామ్యమనిపించుకోదు. పాక్‌కు జీలం నది నీటిని ఆపడం గాని, ఘర్షణలకు కారణమయ్యారని భావించి వారి ఇళ్లు కూల్చి తల మీద కప్పు లేకుండా చేయడం గాని మానవీయమైన పనులు కావు. కక్ష కక్షనే ఇస్తుంది. ఉగ్రవాదానికి అది కూడా దారి తీస్తుంది. మన దేశంలో అధిక సంఖ్యాకుల మతస్వామ్యం వంటిదే రాజ్యమేలుతున్నది. వక్ఫ్ బిల్లులో మోదీ ప్రభుత్వం తేదలిచిన మార్పులను సెక్యులర్ రాజ్యాంగ రక్షకురాలైన సుప్రీంకోర్టు తీవ్రంగా ప్రశ్నించడమే ఇందుకు నిదర్శనం. ఉగ్రవాదం క్రూరమృగం కంటే ప్రమాదకరమైనది. దాని నిజమైన మూలాలు తెలుసుకొని వాటిని నిర్మూలించినంతవరకూ పేట్రేగుతూనే ఉంటుంది.

# ఖరీఫ్ సాగు సమస్యలు తీరేనా

**హైద్రాబాద్ :** 'వానాకాలం పంటల సాగుకు సన్నద్ధం కావాలని... అన్ని జిల్లాల్లో సాగు విస్తీర్ణానికి సరిపడ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని, నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేసే కంపెనీలు, నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని...' ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి వ్యవసాయశాఖ అధికార్లతో ఇటీవలే సచివాలయంలో జరిపిన సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు. ...ఇప్పటికే అన్ని జిల్లాలకు సరిపడ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని... ఈ సీజన్‌లో వరి, పత్తి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంటుందని రైతుల నుంచి డిమాండ్ ఉన్న అన్ని కంపెనీల విత్తనాలు మార్కెట్‌లో ఉన్నాయని, సీఎంకు అధికారులు వివరించారు. కానీ, ఆచరణలో ప్రతి సంవత్సరం జరుగుతున్నది మరో విధంగా ఉంటున్నది.

ఈ సంవత్సరం కూడా దానికి భిన్నంగా ఉండబోదని భావించాల్సి వస్తున్నది. మొత్తం విత్తన అవసరాల్లో ప్రభుత్వ విత్తన సరఫరా 20శాతం మాత్రమే. అలాగే ఎరువుల కొరత కూడా ఉంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని సాధారణం కంటే ముందే తాకాయి. తెలంగాణలో కూడా రుతుపవనాలు వ్యాపించాయి. ఫలితంగా రాష్ట్రంలో తొలకరి జల్లులు పడుతున్నాయి.

# ప్రభుత్వోద్యోగులు జవాబుదారీగా ఉండాలి



పబ్లిక్ సర్వెంట్లు అధికార దుర్వినియోగం, చట్టాలు నిర్వీర్యం చేయకుండా నిరోధించడానికి ఆటంకం కలిగిస్తున్న 'సద్దుద్దేశ్య చర్యలకు రక్షణ' పేరుతో అవినీతి నిరోధక చట్టం, నేర విచారణ చట్టం తదితర చట్టాలలో ఉన్న నిబంధనలను రద్దు చేయాల్సిన అవసరం ఉంది.పాత-కొత్త భూ సమస్యలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం నిత్యం బాధితులు మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులను ఆశ్రయిస్తున్నారు. వీరు ఆ అర్జీలను సంబంధిత అధికారులకు తగు చర్యల నిమిత్తం పంపిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిన సమస్యల కోసం కొద్ది సంఖ్యలో ప్రజలు వీరి వద్దకు రావాలి. దానికి విరుద్ధంగా చిన్న సమస్యల నుంచి పరువు-మర్యాదలు, జీవన్మరణ సమస్యల దాకా వీరి వద్దకు వచ్చి మొరపెట్టుకుం టున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి చిన్న పనికీ రాజకీయ జోక్యం, పని భారం, వ్యక్తిగత ప్రయోజనాలు ప్రభావం చూపిస్తున్నాయి. వాస్తవానికి పబ్లిక్ సర్వెంట్లలో అధిక శాతం సేవాభావంతోనే విధులు నిర్వహిస్తున్నారు. కాని దారితప్పిన కొంతమందితో ప్రభుత్వ సేవకుల పరువుప్రతిష్ఠలు దిగజారుతు న్నాయి. పబ్లిక్ సర్వెంట్లు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ తమ సమస్యలను సంవత్సరాల తరబడి పరిష్కరించడం లేదని ప్రజలు వాపోతున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉద్యోగులు ప్రజల్ని వేధిస్తున్నారు. పబ్లిక్ సర్వెంట్లకి 'రక్షణ' పేరుతో ఉన్న నిబంధనలు వారికి కవచాలుగా ఉన్నాయి. ఒక ఉద్యోగి నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులో తన విధి నిర్వహిస్తే అందుకు తగిన ఆధారాలు ఉంటాయి. చేయని నేరాలను అంటకట్టి తప్పుడు కేసులు పెట్టే బాపతు సామాన్య ప్రజానీకంలో నూటికి ఒక్కరు ఉంటారు. ఆ సందర్భంలో అన్ని రుజువులు పబ్లిక్ సర్వెంట్లకు అందుబాటులో ఉంటాయి. కాబట్టి నిరూపించుకుని, బయటపడడం సులువు. ప్రభుత్వోద్యోగి అధికార దుర్వినియోగాన్ని లేదా చట్టం నిర్వీర్యం చేయడాన్ని నిరూపించాలంటే సామాన్య ప్రజానీకానికి చాలా కష్టమైన పని. అందువల్ల మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు తమ వద్దకు వచ్చే ఫిర్యాదులు పరిష్కారం చేయడంతో పాటు అసలు తమ వద్దకు సమస్య వచ్చేదాకా పరిష్కారం చేయకపోవడానికి కారణాలు ఏమిటో అధికారుల నుంచి సంజాయిషీ కోరాలి. అందులో నిర్లక్ష్యం లేదా కారణాలు సరిగా లేకపోతే వారిపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమిస్తే, భవిష్యత్తులో ఈ తప్పిదాలు పునరావృతం కావు.

## పాకిస్థాన్‌ను ముంచిన

# మతమౌఢ్యం

మతాన్ని కేంద్రంగా చేసుకుని పరిపాలిస్తే ఒక దేశం ఏ విధంగా వెనుకబడిపోతుందనేది పాకిస్థాన్‌ను పరిశీలిస్తే అవగతమవుతుంది. మత ప్రాతిపదికన ఏర్పడిన దేశమది. తొలి నుంచీ అనుసరించిన మత ప్రేరిత విధానాల వల్ల పాకిస్థాన్ అన్ని రంగాలలో వెనుకబడి పోయింది. ఇటీవల ఖతర్ పర్యటన నుంచి స్వదేశానికి తిరిగి వెళ్ళిన పాకిస్థాన్ ప్రధాని షహేబాజ్ షరీఫ్ 'తాము 75 ఏళ్ళుగా బిక్షాటన చేస్తున్నట్లు' వాపోయారు! 1947లో స్వతంత్ర దేశంగా ఆవిర్భవించినప్పుడు పాకిస్థాన్‌కు వ్యవసాయమే ప్రధాన ఆదాయవనరు. పాకిస్థాన్ భౌగోళికంగా భారత్ కంటే చిన్న దేశమే అయినప్పటికీ సమృద్ధ జలవనరులు, సారవంతమైన సాగు భూములకు నెలవైన పంజాబ్ కారణాన పాక్ ఆర్థిక స్థితిగతులు మెరుగ్గా ఉండేవి. అవిభక్త భారత్ విభజన నాటికి ఉన్న 921 ప్రధాన పరిశ్రమలలో కేవలం 34 మాత్రమే పాక్‌కు దక్కాయి. అవి కూడా ప్రధానంగా బెంగాల్‌లోని జనపనార పరిశ్రమలు మాత్రమే. 1950లో పాకిస్థాన్ తలసరి ఆదాయం 1268 డాలర్లు. ఇది అప్పట్లో భారత్ తలసరి ఆదాయం కంటే దాదాపు రెండు రెట్లు అధికం. అయితే కశ్మీర్‌ను స్వాయత్తం చేసుకోవడమే పాక్ జాతీయ రాజకీయాల ప్రధాన లక్ష్యమయింది. ఆ లక్ష్య సాధనకై భారత్‌కు వ్యతిరేకంగా యుద్ధాలకు తెగబడింది. ఈ యుద్ధాలు, రాజకీయాల వల్ల పౌర, సైనిక పాలకులు పలు విధాల ప్రయోజనాలు పొందారు. అయితే దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లడంలో విఫలమయ్యారు. దేశాన్ని అత్యధిక కాలం ఏలిన సైనికాధికారులు ఇస్లామిక్ భావజాలంతో కశ్మీర్‌ను బూచిగా చూపి పంజాబీలు, సింధీలు, బలూచీలు, పఠాన్లు, మహాజీర్లుగా విడిపోయిన దేశాన్ని ఒక్కటిగా నిలబెట్టారు. అయితే దానితో పాటు దేశ బడ్జెట్ కేటాయింపుల్లో సింహభాగాన్ని రక్షణ శాఖకు దక్కించుకోవడంలో సఫలీకృతులయ్యారు. సోవియట్ యూనియన్, అమెరికా మధ్య ప్రచ్ఛన్న యుద్ధంలో పొరుగున ఉన్న అఫ్ఘానిస్థాన్ ఒక పావుగా మారింది. పాక్ సైన్యంలో స్వతహాగా అత్యధికులుగా ఉన్న పఠాన్ల అంశం, అఫ్ఘాన్ లోని పరిణామాలు సహజంగా ఇస్లామాబాద్‌కు అంతర్జాతీయంగా ఒక సముచిత పాత్రను కల్పించాయి. సోవియట్ ఎర్రసేనలను దెబ్బతీయడానికి అమెరికా జిహాద్‌ను ప్రోత్సహించి పాకిస్థాన్‌కు అన్ని రకాలుగా అండగా నిలిచింది. జనరల్ జియా ఉల్ హఖ్ హయాంలో ఈ జిహాద్ ఉగ్రవాదం పరాకాష్ఠకు చేరుకుంది. అమెరికా మద్దతుతో ఇస్లామాబాద్ పాలకులు ఆడింది ఆట పాడింది పాట అయింది. ఇదే సమయంలో పాక్ పాలకులు తాము అనుసరిస్తున్న మత ప్రేరిత భావజాలానికే మరింతగా నిబద్ధమయ్యారు. సోవియట్ యూనియన్ కుప్పకూలిన తర్వాత జిహాద్ నుంచి అమెరికా వైదొలిగినా ఆ భావజాలం మాత్రం అదే విధంగా పాక్ రాజకీయాలు, సమాజంలోనూ దృఢంగా ఉండిపోయింది.



# ఇండియా మొత్తంలో ఒక్క అమ్మాయే..

'ఈ సినిమా చూసిన తర్వాత ప్రతీ ఒక్కరికి ప్రేమతత్వం బోధపడుతుంది. థియేటర్‌కు వెళ్లిన ప్రేక్షకులు ప్రేమను గుండెల్లో నింపుకొని తిరిగొస్తారు. ఈ సినిమా ఓపెనింగ్ సీక్వెన్స్ అస్సలు మిస్ కావొద్దు. ఎందుకంటే రివర్స్ స్క్రీన్‌ప్లేతో నడిచే చిత్రమిది' అన్నారు ఫణీంద్ర నర్సెట్టి. ఆయన దర్శకత్వంలో అనంతిక సనీల్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన పొయెటిక్ లవ్‌స్టోరీ '8వసంతాలు'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నాయిక పాత్రకోసం క్లాసికల్ డ్యాన్స్, మార్షల్ ఆర్ట్స్ రెండూ తెలిసిన అమ్మాయి కావాలని ఇండియా మొత్తం వెతికితే ఒక్క అమ్మాయి దొరికింది. తనే అనంతిక. ఈ చిత్రంలో ఆమె అద్భుతంగా పర్ఫార్మ్ చేసింది' అన్నారు. ఈ సినిమాలో తాను శుద్ధి అయోధ్య అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, కథలోని భావోద్వేగాలు ప్రతీ ఒక్కరికి కనెక్ట్ అవుతాయని కథానాయిక అనంతిక పేర్కొంది. హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలు కలబోసిన చిత్రమిదని నిర్మాత నవీన్ యెర్నేని తెలిపారు.

# మా సంస్థ విలువను పెంచుతుంది

'మా సంస్థలో 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత 'తమ్ముడు' సినిమాతో



మీ ముందుకొస్తున్నాం. మా బ్యానర్‌లో తొలిసారి బ్రదర్, సిస్టర్ సెంటిమెంట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. తప్పకుండా ఈ సినిమా అందరికి నచ్చుతుంది' అన్నారు అగ్ర నిర్మాత దిల్ రాజు. ఆయన నిర్మించిన తాజా చిత్రం 'తమ్ముడు' జూలై 4న ప్రేక్షకుల ముందుకురానుంది. నితిన్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహించారు. ఈ సినిమాలోని 'భూ అంటూ భూతం' అనే తొలి గీతాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం 80రోజులు అడవిలో షూటింగ్ చేశాం. ఫ్యామిలీస్, యూత్, పిల్లలు అందరూ ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది. థియేటర్స్ నుంచి బయటకు వచ్చే ముందు ఓ ఫీల్‌గుడ్ మూవీని చూశామనే అనుభూతి కలుగుతుంది. మా బ్యానర్ విలువను పెంచే సినిమా ఇది' అని చెప్పారు. కథలోని ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని హీరో నితిన్ తెలిపారు. చాలా విరామం తర్వాత తెలుగులో నటించానని, కుటుంబ అనుబంధాలకు పెద్దపీట వేసిన కథ ఇదని నటి లయ అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, రచన-దర్శకత్వం: శ్రీరామ్ వేణు.

# 'లెనిన్' సినిమా కథ అదేనా?



యువ హీరో అక్కినేని అఖిల్ కెరీర్‌లో ఓ భారీ హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజా చిత్రం 'లెనిన్'పైనే ఆశలు పెట్టుకున్నారు. ఈ సినిమా గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. అఖిల్ లుక్స్, పర్‌ఫార్మెన్స్ బాగుందని ప్రశంసలొచ్చాయి. ఈ సినిమాపై ఇప్పటికే పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. అ నేపథ్యంలో ఈ సినిమా కథ గురించి ఇంట్రెస్టింగ్ న్యూస్ ప్రచారంలోకి వచ్చింది. రాయలసీమ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. గ్లింప్స్‌లో అఖిల్ రాయలసీమ యాసలో చెప్పిన డైలాగ్స్ కూడా మెప్పించాయి. అయితే ఈ సినిమా కథలో పరువు హత్యల నేపథ్యం ప్రధానంగా ఉంటుందని తెలుస్తున్నది. గ్రామంలోని ఓ ఆలయం చుట్టూ కథ నడుస్తుందని, బలమైన సామాజికాంశాలను కూడా చర్చించారని టాక్ వినిపిస్తున్నది. అయితే ఈ విషయంలో నిజమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. మురళీకిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, నాగార్జున సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# ఫీల్‌గుడ్ రొమాంటిక్ స్టోరీ



సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసుకదా'. ట్కస్టైలిస్ట్ నీరజా కోన దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. రాశీఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం హైదరాబాద్‌లో చివరి షెడ్యూల్ ప్రారంభమైంది. ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో నాయకానాయికలపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నామని, దీనితో షూటింగ్ మొత్తం పూర్తవుతుందని, డబ్బింగ్ పనులను కూడా మొదలుపెట్టామని చిత్రబృందం పేర్కొంది. ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా అలరిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్ బాబా, సంగీతం: తమన్, నిర్మాతలు: టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతిప్రసాద్, రచన-దర్శకత్వం: నీరజ కోన.

# మెగా 157కోసం ముస్సోరికి..

అగ్ర కథానాయిక నయనతార రూట్ మార్చుకుంది. సినిమా ప్రమోషన్స్‌కు దూరంగా ఉండే ఈ భామ ఇప్పుడు ప్రచార వీడియోలతో సందడి చేస్తున్నది. ఇదంతా చిరంజీవి 157వ సినిమా కోసం కావడం విశేషం. అనిల్‌రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. మెగా157 వర్కింగ్ టైటిల్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రంలో నయనతార కథానాయిక. ఈ సినిమా కోసం ఇటీవల నయనతార ఓ ప్రమోషనల్ వీడియోను విడుదల చేయగా..దానికి అద్భుతమైన స్పందన లభించింది. ముమ్ముందు సినిమా ప్రచార కార్యక్రమాల్లో నయనతార అదరగొట్టబోతున్నదని మేకర్స్ చెబుతున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముస్సోరిలో జరుగుతున్నది. ఈ షూట్‌లో నయనతార జాయిన్ అయ్యారు. కామెడీ ప్రధానంగా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన వీడియోలో చిరంజీవి వింటేజ్ అవతార్‌లో కనిపించారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాతలు: సాహు గారపాటి, సుస్మిత కొణిదెల, రచన-దర్శకత్వం: అనిల్ రావిపూడి.



Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146